కవితా కౌముది

# చిలిపి సుద్దులు

లాస్యప్రియ కుప్పా

వలపు మేఘాల దాడిలో
చిలిపి చినుకులు చిత్తడి చేస్తున్నాయి
తలపు తమస్సుల వాడిలో
దిక్కులన్ని దొక్కుంటున్నాయి
వగలు సెగలు ఎగదోస్తుంటే
కొమ్మా రెమ్మా కులుకుల సీమంతమంటున్నాయి

కైపు గీతాల కుహూకుహూల సంగతుల్లో
వసంతం నిలువెల్లా పసిడి పూతలు సంతరించుకుంటుంది
నేనే నీ లోకమంటూ
నీవే నా అనుభవమంటూ
ఆకాశపు ఆలింగనంలో ఒదిగిపోతాం

గాలి నులివెచ్చదనాల్లో కొత్త రాగం
హృదయంలో గిలిగింతలు పెడుతుంటే
ఉడుకు రక్తం ఉరకల్లో కిన్నెరసాని కులుకులు
కొత్తపరిమళం సంతరించుకున్న రేయి జ్ఞాపకాల్లో
పారిజాతాల పలకరింతల పరవశాలు
అధర సుధల సుద్దులంటూ

రా.. మరి
మరొక్కసారి
నిదురలో విర్రవీగే రాత్రి రెపరెపల్ని
పగటి పచ్చదనంలో పొదుగుదాము

***

# ఓ మనిషి

శతపత్ర

ఏ భావమో, కవితో, కథో, వ్యథో
కదిలించినా చలించనంత
మొద్దు బారిన హృదయంతో
బ్రతకడం కూడా జీవించడమేనా!?

మనిషంటేనే ఓ మథించని పుస్తకం
కొన్ని విషాద పుటలు
మరికొన్ని ఆనందోత్సాహ పేజీలు
కొన్నిసార్లు ఎగసిపడే ఉద్వేగ క్షణాలు
ఇంకొన్నిసార్లు మౌనంగా జారిపోయే నిర్లిప్త నిమిషాలు!

నిజానికి మనిషన్నాక
లేత తావిపై పువ్వులా సన్న స్పర్శకు ఊగిపోవాలి
నీరెండ పొడలో నీడలతో పసితనమై ఆడుకోవాలి
చిన్ని పిట్టను చూసి గగుర్పడే సున్నితత్వమవ్వాలి
అప్పుడప్పుడు అరిచి ఆనందపడాలి
ఎప్పుడో అప్పుడు కన్నీరై కరిగి ఇంకిపోవాలి
కెరటంలా ఎగిసిపడి సమాధానపడాలి
ఉరుమై ఉరిమి ఉనికి చాటుకోవాలి
దిక్కులు పిక్కటిల్లేలా ధిక్కార స్వరాన్ని ఎత్తుకోగల ధైర్యమవ్వాలి

★★★







# అమ్మ

ఆచాళ్ల శ్రీనివాసరావు

అమ్మ చేసిందేముంది
ఉమ్మ నీటిలో నిన్నూనన్నూ మోయడం తప్ప
అమ్మ చేసిందేముంది
నిన్నూ నన్నూ మోసి కడుపున
కన్న ఒక్క పాపం తప్ప
అమ్మ చేసిందేముంది. .
తాను తినకుంటే నువ్వు ఎదగవనీ
నచ్చకున్నా ఎన్నో తిన్న నిండు చూలింత
ఏవి తను తింటే నీకు ఏమవునో అని
కటిక పత్యాలెన్నో చేసిన పచ్చి బాలింత. ..
అమ్మ చేసిందేముంది. ..

ప్రాణధారని పాలగా పిల్చి బ్రతికిన ఆ క్షణం
గుర్తు రాదా లీలగా
అమ్మనొదిలేసే క్షణం?
రెక్కలొచ్చీ ఎగరడం
తప్పుకాదే పక్షికి
ఎగిరి గింజలు తెచ్చి గూటికి
ఆర్తినివ్వాలమ్మ నోటికి
అమ్మ చేసిందేముంది.

నిన్ను చూసిన తొలి క్షణాన
పురిటి నొప్పుల నరకయాతన
మరిచిపోలేదా అమ్మ మురిసిపోలేదా
జన్మనిస్తూ నీకు మరుజన్మ తానెత్తీ...
సేవలెన్నో చేసిందే చాటిందా నోరెత్తి.
అమ్మ చేసిందేముంది !

కడుపులో చోటిచ్చిందే
కాలితో నువు తన్నినా
ఇంటనింత చోటు లేదా
అమ్మ కి వయసుడిగినా
అమ్మ తోడుంటే ముక్కోటి దేవతలూ
నిలిచి ముంగిట వెన్నుకాచే -
యోగమే నీది
అమ్మ కాదంటే నీకిజన్మ ఎక్కడిదీ
కోటి కణముల ప్రవాహంలో
ఉనికినెరుగని నలుసువి
అమ్మ కడుపు చలువ నాడు
కాయబట్టి మనిషివి
అమ్మ చేసిందేముంది. .

★★★



# మెరుగు పూలు
## డేగల అనితాసూరి

జనారణ్యంలో
కాంక్రీటు చివుళ్ళు
నారుమడిలా కళ్ళు తెరిచింది
కోయిల కాళ్ళక్రింది
కొమ్మలు నరికి
అపార్ట్మెంట్ పెదవుల్తో
అట్టహాసంగా ఆహ్వానిస్తోంది
ఇనుపఊచల చెఱ!
మల్లె గుత్తులన్నీ
సెంటు తోటలో విరబూశాయి
ఏసీ వింజామర
విద్యుత్ కనుసన్నలతో
చల్లగాలై వీస్తోంది
వెన్నెల రాత్రుల ఆకాశం
పైకప్పుకు అంటించిన త్రీడీ పోస్టర్లో
మెరుస్తోంది నిత్యవసంతం
మొత్తంగా ప్రకృతి ఇప్పుడు
వికృతై రెండుగా విడిపోయింది
ఒకటి సహజం
రెండు కృతకం!

★★★



# సెరువు
## వడ్లకొండ దయాకర్

ఆయిటిబూనంగ
మొగులు మూర్వంగ
వానల తానమాడంగ
ఊరగుట్టపై దునికిన 'జలపాతం'
వాగులై పారంగ
బంటాలు నిండంగ
సుట్టకుదురు పై కొల్వైన
నిండుకుండ నా 'సెరువు'.!
సెరువు రైతుల పాలిటి
గుమ్మి ల 'గాసం' ,
కంచుట్ల 'బువ్వ',
గోళెం ల 'నీళ్లు'.!
ఇగ జనానికైతే ..
'బోనంకుండ'
కొండంత 'అండ'
కన్నతల్లి తరీకె!
'బర్రెగొడ్ల' కు ఒళ్ళుసలువ
'ఆలమందల'కు ఆటవిడుపు
'సాకిరేవుల' మద్దెలదరువు
చేప'పిల్లల' ఈతకొలను
'కొంగ బావ'ల విహారయాత్ర
'తీరొక్క పచ్చుల' తీర్థయాత్ర నా సెరువు. !
అలుగు పారంగ ఉబికిన పాలధార
తూములు తెర్వంగ ఉరికే కోడెతాసు
కట్టపంటి పోయెటోళ్ళ 'కండ్లసలువ' నా సెరువు.
ఎంగిలిపూలు పేర్సి,
పసుపు-కుంకుమ జల్లి,
పలారం పంచి,
మంగళారతులిచ్చి,
సద్దుల బతుకమ్మను సాగనంపేయాళ్ళ
కొప్పున తామర్లు ముడ్సుకున్న
నిండుముత్తైదువ నా సెరువు. ★★★

# రసరేఖలు

## శ్రీధర్ బచ్చోటి

రెండు చినుకులు చాలును రేయినెల్ల
చల్లబరుపగ నిండు వేసవిని కూడ
రెండు విచ్చిన పూవుల రేకులైన
ఏ యెడారినైనను వికసింపజేయు

కన్ను గానని గాఢాంధకారమందు
జ్యోతియై ప్రజ్వరిల్లు ఖద్యోతమైన
గొంతు తడియారి నీటిని కోరినపుడు
రెండు జలకణమ్ములమృతభాండమగును

ఎన్నడును స్వేచ్ఛ యెరుగని హృదయమునకు
క్షణవిముక్తియె యుగమట్లు కానుపించు
కుండపోతగ వర్షమ్ము కురియునపుడు
పిన్నచెట్టైన తానగు పెద్ద దిక్కు

ఒక్క విరి యెట్లొ వచ్చి నా యొడిని వ్రాల
కల్పవృక్షమె నా యింట కానుపించు
నిత్యమును లేమి బ్రతుకున నిండినపుడు
చిన్న నాణెమె యైశ్వర్యచిహ్నమగును

ఎంత కాలము నన్ను నీవెంచకున్న
క్షణము సారించు నీ చూపు స్వర్గసమము
జీవితమ్మెల్ల త్రోసిపుచ్చినను గాని
చిన్న యలవోక చిరునవ్వు పెన్నిధగును


చిత్రం:కె.రామ్మోహాన్